విద్యార్థులు ఇష్టంగా చదువాలి

చేవెళ్ల, అల్వాల్ సీఐలు భూపాల్ శ్రీధర్, రాజేందర్‌గౌడ్

విద్యార్థిని పూజకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న నిర్వాహకులు

చేవెళ్లటౌన్, ఆగస్టు 24 : విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదువాలని చేవెళ్ల, అల్వాల్ సీఐలు భూపాల్ శ్రీధర్, రాజేందర్‌గౌడ్ అన్నారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డే ను కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో రెం డో ర్యాంక్ సాధించిన విద్యార్థిని పూజకు ల్యాప్‌టాప్‌ను బహుమతిగా ఇవ్వగా టెన్త్‌లో 10జీపీఏ సాధించిన మరో విద్యార్థిని సాయిమనోజ్ఞకు రూ.10 వేలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. డ్రగ్స్, మత్తుపదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం కళాశాల చైర్మన్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ సభ్యులు రాజు, రాఘవేం దర్‌రెడ్డి, డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య సేవలు మరవలేం

కడ్తాల్, ఆగస్టు 24 : మండలంలో దివంగత హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య చేసిన సేవలు మరవలేనివని సీఐ శివప్రసాద్ అన్నారు. నాలుగు రోజుల కిందట ఠాణాలో విధుల్లో ఉండగా గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య మృతి చెందగా..శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలపాటు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, ఏఎస్ఐలు ప్రసాద్‌జీ, నిరంజన్, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న టీచర్లకు సన్మానం

ఉపాధ్యాయులకు బదిలీలు, పదవీవిరమణలు తప్పనిసరిగా ఉంటాయని పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, మద్దూర్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం జయరాజ్ అన్నారు. శనివారం మండలంలోని మద్దూర్ పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు శంకర్, మాలిని, స్వరూపలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – షాబాద్, ఆగస్టు 24

ఓటరు జాబితాను రూపొందించాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్

చేవెళ్ల రూరల్, ఆగస్టు 24 : ఇంటింటి సర్వే నిర్వహించి ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్ అన్నారు. శనివారం శంకర్‌పల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ బూత్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్ మాట్లాడుతూ..బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే చేసి ఆ ఇంటిలో ఉంటున్న ఓటర్ల వివరాలను ఆధారాలతో మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం డీఎల్ఎంటీ ఆశీర్వాదం మాట్లాడుతూ.. ఓటరు జాబితాను మొబైల్ యాప్ ద్వారా పటిష్టపరిచేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చనిపోయిన వారి పేర్లను తొలగించడంతోపాటు కొత్త ఓటర్ల నమోదు, 17 ఏండ్లు నిండిన వారి వివరాలను సేకరించడం, తప్పొప్పులను సరిచేయాలన్నారు.

తుర్కయాంజాల్, ఆగస్టు 24 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో రూ.176 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శనివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అధ్యక్షతన రాగన్నగూడలోని ఏబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరై మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ, టీయూఎఫ్ఐడీసీ, మున్సిపల్ జనరల్ ఫండ్ మొత్తం రూ.176 కోట్లతో మున్సిపాలిటీలో మౌలిక వసతులతోపాటు పలు అభివృద్ధి పనులను చేపడుతామన్నారు. పలువురు కౌన్సిలర్లు వార్డుల్లోని సమస్యలను మల్‌రెడ్డి రాంరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వాటిని వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. అనంతరం టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.25 కోట్లను అభివృద్ధి పనులను కేటాయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ హరిత, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్‌నాయక్, అయిలయ్య, కౌన్సిలర్లు జ్యోతి, శ్రీలత, అనిత, మంగమ్మ, కీర్తన, భాగ్యమ్మ, ఉదయశ్రీ, ధన్‌రాజ్, రవీందర్‌రెడ్డి, సునీల్, శ్రీలత, మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, డీఈ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

రూ.176 కోట్లతో మున్సిపాలిటీలో

అభివృద్ధి పనులు

రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

పాఠశాలల్లో కోలాహలంగా

కృష్ణాష్టమి వేడుకలు

ఆమనగల్లు, ఆగస్టు 24 : మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. ప్రతి పాఠశాలలోనూ చిన్నారులు గోపిక, కృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమం సందడిగా సాగింది. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

కడ్తాల్ : మండలంలోని పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఫార్చ్యూన్ బట్టర్‌ఫ్లై స్కూల్‌లో చిన్నారులు గోపిక, కృష్ణుడి వేషధారణతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీవ్‌నాంపల్లి, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో

షాబాద్ : మండల కేంద్రంలోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణుడి, గోపిక వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశా ల కరస్పాడెంట్ మహేశ్‌యాదవ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్‌లో..

చేవెళ్లటౌన్ : చేవెళ్ల మండల కేంద్రంలోని సిల్వర్ డెల్ స్కూల్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణతో అలరిం చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహనాచారి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కంఠమహేశ్వరస్వామి బోనాలు

కడ్తాల్, ఆగస్టు 24 : మండల కేంద్రంలో శనివారం గౌడ కులస్తులు కంఠమహేశ్వరస్వామి బోనాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, హారతి, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కంఠమహేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. సాయంత్రం మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగించారు. ఈ సందర్భంగా పోతరాజులు, శివసత్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయంలో స్వామివారికి మహిళలు బోనాల్లో తీసుకెళ్లిన నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం మండలాధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, సభ్యులు యాదయ్యగౌడ్, కేశవులుగౌడ్, శివగౌడ్, రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, మహేందర్ గౌడ్, రాజుగౌడ్, వెంకటయ్యగౌడ్, చంద్రయ్యగౌడ్, మహిళలు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మంచాలలో..

మంచాల : మండలంలోని జాపాల గ్రామంలో గౌడ కులస్తులు కాటమయ్యస్వామి బోనాలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారికి గౌడ సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మహిళలు బోనాలను ఊరేగించి ఆలయంలో స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహేశ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, బాల్‌రాజ్ గౌడ్, రాముగౌడ్, నాగరాజు గౌడ్, సత్తం గౌడ్,మధు గౌడ్, జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్‌యాదవ్, భక్తులు

వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

కడ్తాల్, ఆగస్టు 24 : తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామ పంచాయతీలో గలచెన్నంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మతల్లి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. వేద పండితులు నరసింహ్మయ్యశర్మ, యాదగిరి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, మాజీ ఎంపీటీసీలు ఆంజనేయులు, అంబాజీ, మాజీ ఉప సర్పంచ్‌లు మల్లేశ్, ఆజీజ్, నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, సదానందంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్యయాదవ్, నరేందర్‌గౌడ్, వెంకటయ్య, శ్రీనివాస్‌యాదవ్, శేఖర్‌గౌడ్, చంద్రయ్య, కృష్ణయ్య, రాములు, రామస్వామి, రాజేందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

బోనాల ఉత్సవాలకు విరాళం అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, ఆగస్టు 24 : ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బోనాల ఉత్సవాల నిమిత్తం గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ తరపున చైర్మన్ వెంకటేశ్‌గుప్తా రూ.30 వేలు, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరపున చైర్మన్ దశరథ్‌నాయక్ రూ.10 వేలు విరాళాన్ని ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌గుప్తా మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం బోనాల పండుగకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్, సభ్యులు రాములు, మల్లేశ్‌గౌడ్, నాయకులు కృష్ణనాయక్, టీకులాల్‌నాయక్, మహేశ్, ప్రతాప్‌రెడ్డి, రమేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఊరపోచమ్మ బోనాలు

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఊరపోచమ్మ బోనాలు ఆదివారం జరుగనున్నాయి. ఇందుకోసం ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో సుందరంగా అలరిం చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆర్థిక సాయం అందజేత

షాబాద్, ఆగస్టు 24 : ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటానని సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ నర్సింహులు అన్నారు. శనివారం కొమ్ము జంగయ్య అనే వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు అందించారు.

శెట్టిపల్లి గ్రామంలో..

ఆమనగల్లు : మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము సురేశ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్యం శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు.

క్రీడా సామగ్రి కొనుగోలుకు రూ.10 వేలు వితరణ

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తానని పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రావిచేడ్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడాసామగ్రి కొనుగోలు నిమిత్తం ఆయన శనివారం పాఠశాల హెచ్ఎంకు రూ.10 వేలు నగదును అందజేశారు. అనంతరం శ్రీనివాస్‌ను ఉపాధ్యా యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, నాయకులు జనార్దన్‌గౌడ్, రాఘవేందర్, ఉపాధ్యాయులు స్వరూప, అశోక్, సతీశ్, రమేశ్, మంజుల, వినోద్, శ్రీదేవి, పీడీ సాబేర్, విద్యార్థులు పాల్గొన్నారు. –కడ్తాల్, ఆగస్టు 24

కరాటే పోటీల్లో

చిన్నారికి గోల్డ్ మెడల్

షాబాద్, ఆగస్టు 24 : కరాటే పోటీల్లో చిన్నారి గోల్డ్‌మెడల్ సాధించింది. మండలంలోని లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన మేకల విజయ్‌శేఖర్, ప్రభావతి దంపతుల కుమార్తె జ్ఞానతేజ శనివారం బెంగళూరులో జరిగిన ఓపెన్ శివమొగ్గ–2024 ఐదో అంతర్జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని ప్రథమ గోల్డ్ మెడల్‌ను సాధించింది.

పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడిగా వెంకటేశ్

మంచాల, ఆగస్టు 24 : పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడిగా వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పీఆర్‌టీయూ సంఘం మండల సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడిగా ఎండీ జావిద్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు పరమేశ్, జమీర్, రాములు, సీతారాం నాయక్, రాజు, బాషయ్య, శ్రీను, లింగం తదితరులు పాల్గొన్నారు.

కారు, లారీ ఢీ.. ట్రాఫిక్ జాం

చేవెళ్ల రూరల్, ఆగస్టు 24 : శంకర్‌పల్లి పట్టణ పరిధి ప్రధాన రోడ్డులో శనివారం కారు, లారీ ఢీకొనడంతో వాహనాలు బారులుదీరి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదరాబాద్ నుంచి శంకర్‌పల్లి ప్రధాన రోడ్డుకు లారీ, కారు ఒకదాని వెం బడి మరొకటి వస్తున్న క్రమంలో కారు లారీ ట్రైల్ కింద ఇరుకున్నది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేసి లారీని ఠాణాకు తరలించారు.

మహిళ అదృశ్యం

సరోజ

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 24 : భర్తతో గొడవపడిన ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జమేశ్, సరోజ అలియాస్ అంజుమ భార్యాభర్తలు. జమేశ్ వెల్డర్‌గా పనిచేస్తూ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో జీవిస్తున్నారు. ఆ దంపతులకు మూడేండ్ల పాప ఉన్నది. కొన్ని రోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 21న మరోసారి గొడవ జరిగింది. దీంతో పనికి వెళ్లిన సరోజ తిరిగి ఇంటికి రాలేదు. పాపను ఇంటి వద్దే వదలిపెట్టి వెళ్లింది. ఆమె ఆచూకీ లభించకపోవడంతో జమేశ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తలకొండపల్లి ఏవోగా రేణుకాచక్రవర్తి

కడ్తాల్, ఆగస్టు 24 : తలకొండపల్లి వ్యవసాయ శాఖ అధికారిణిగా రేణుకాచక్రవర్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న రాజు నాగర్‌కర్నూల్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో రాజేంద్రనగర్ ఎస్టీఎల్‌లో పనిచేస్తున్న రేణుకా చక్రవర్తి ఇక్కడికి వచ్చారు. అలాగే తలకొండపల్లి, గట్టుఇప్పలపల్లి, పడకల్ క్లస్టర్ల ఏఈవోలుగా లలితా సుస్మిత, అర్చన, త్రిలోక్య బాధ్యతలను స్వీకరించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

షాబాద్, ఆగస్టు 24 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ చెన్నయ్య అన్నారు. శనివారం మండలంలోని సంకెపల్లిగూడ గ్రామంలోని ఆలయంలో యజ్ఞహోమాలు, వ్రతాలు నిర్వహించారు. పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సత్కారం

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 24: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు పదవీ విరమణ చేయగా.. శనివారం ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు ఆయనను సత్కరించి వీడ్కోలు పలికారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలి

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ మల్కా కొమురయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు సమీపంలోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో ఓరియంటేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఇన్సోసిస్ సాప్ సీనియర్ కన్సల్టెంట్ శివప్రసాద్ కరాడి, సైంటిస్ట్ డాక్టర్ ప్రవీణ్ సామల, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ డైరెక్టర్ కందకూరి రమేశ్, డీఆర్డీఎల్ సీనియర్ సైంటిస్ట్ వీరమహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు దేశ అభ్యున్నతికి ఉపయోగపడే సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. అనంతరం అకడమిక్స్‌లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, డైరెక్టర్ రామశేషగిరిరావు, ప్రిన్సిపాల్ రాజు, కన్వీనర్ రమ్య, కాలేజీ ప్రతినిధులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. –పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 24

లక్ష్యసాధనకు కష్టపడాలి

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరే వరకు కష్టపడాలని జేఎన్‌టీయూ యూజీసీ డైరెక్టర్ విశ్వనాథ్ అన్నారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లి పటేల్‌గూడ సమీపంలోని విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఓరియంటేషన్ డేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ప్రత్యేక అతిథిగా విచ్చేసిన డాక్టర్ శ్రీనాథాచారి జీవితంలో ఏ విధంగా రాణించాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ లక్ష్మీనారాయణ, సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ కన్నయ్యశెట్టి, కోశాధికారి రాములు, ప్రిన్సిపాల్ రమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. –ఆదిబట్ల, ఆగస్టు 24

విద్యార్థులు సమాజానికి దోహదపడాలి

ఇంజినీరింగ్ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని ఇన్‌సెప్షన్ అండ్ అటామ్ స్టాట్ టెక్ కో ఫౌండర్ అండ్ సీఈవో వెంకటసుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని చిలుకూరు గ్రామ రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 13వ పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2020–24 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రోహిత్, ఫినిక్స్ గ్రూప్ జనరల్ మేనేజర్ గునేశ్, సోషియల్ ఎంటర్‌ప్రైజెస్ కోఫౌండర్ ప్రశాంత్ లింగం, కళాశాల ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. –మొయినాబాద్, ఆగస్టు 24

మా స్థలాలను కాపాడండి

మొయినాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌కు సజ్జన్‌పల్లివాసుల వినతి

మొయినాబాద్, ఆగస్టు 24 : పేదలకు ఇండ్లు నిర్మించుకునేందుకు ఇచ్చిన ప్రభుత్వ స్థలాన్ని కొందరు రియల్ వ్యాపారులు కబ్జాకు యత్నిస్తున్నారని సజ్జన్‌పల్లి గ్రామస్తులు సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సజ్జన్‌పల్లిలో 2007లో పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు నిర్మించుకునేందుకు 7.36 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించగా..72 మందికి ఇండ్ల స్థలాలు రాగా.. పట్టాలు పొందిన వారిలో 15 మంది వరకు ఇండ్లు నిర్మించుకున్నారని, ఆర్థిక స్థోమత లేని వారు ఇండ్లు కట్టుకోకుండా స్థలాలను అలాగే ఉంచుకున్నారన్నారు. అయితే కొందరు ఆ భూమి తమదని, పట్టా పాస్‌పుస్తకాలు కూడా ఉన్నాయని చెప్పి రియల్ వ్యాపారులకు విక్రయించేందుకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇండ్లు నిర్మించుకుని ఉంటున్న వారి నల్లా పైపులను ధ్వంసం చేయడంతోపాటు విద్యుత్తు తీగలను తెంపేశార ని వివరించారు. మా స్థలాలను కాపాడి.. రియల్ వ్యాపారులకు విక్రయించేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారికి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సజ్జన్‌పల్లి గ్రామస్తులు